స్త్రీ ప్రతాపము

వెలువోలు సీతారామయ్య చౌదరిగారు

౧

"ప్రేయసీ! ఇదంతయు అదృష్టదేవతయొక్క ఆట. లక్ష్మిఅతిచపలురాలు, ఆమె యెప్పుడూ ఒకేపద్ధతిగా ఉండదు. నిన్నమహారాజు—నేడుబిచ్చగాడు."

"నాథా! నేను క్షత్రియపుత్రికను, అదృష్టమును లెక్కించేదాననుకాను. వీరపురుషుడు తనపౌరుషము చేతనే అదృష్టమును సృష్టించుతాడు."

"విశ్వేశ్వరునికి వ్యతిరేకంగానా! మనుష్యబలం ఎంత?

"కర్మక్షేత్రంలో ధైర్యంగానిల్వబడడమే వాని కర్తవ్యం."

"రణరంగంలో పరాజయం కలిగితే"

"అక్కడే ప్రాణంవదలుతాడు. ప్రవాహములో పడి అలలు ఎక్కడకుతీసుకొనివెళ్లి వదలితే అక్కడ బయలుపడేతృణంవంటివాడా వీరపురుషుడు?"

"రాజ్యాన్నిపోగొట్టుకొని చివరను నీచమైన నౌకరీచేయవలసివచ్చింది. ఇదంతా విధాతృలీల."

"ఇది అల్పబుద్ధితోఆడిన జూదపుఆట"

"ప్రేయసీ! ఈరీతిగా మాట్లాడుతావేల! నీకేమి కష్టంఇక్కడ! ఎటువంటి సుందరమైనవనప్రదేశం, తియ్యటి సెలయేటినీళ్లు, మంచిపళ్లు, పచ్చికబయళ్లు!"

"పరాధీనతలో ఒకక్షణంఉండటంకూడా అసహ్యమే. పిరికివాడు ఇటువంటియుక్తులతో సంతోషపెట్టాలనిచూస్తాడు."

"ప్రేయసీ! పతితో ఈవిధంగా కఠోరవాక్యాలు పలుకడం ఉచితంకాదు."

"నిజమే, క్షత్రియునకు యుద్ధంలో వెన్నుచూపడంఉచితమైనపనేనా! పురుషుడు స్త్రీకిభర్తఅయినప్పటినుంచీ ఎప్పుడూస్త్రీయొక్కకర్తవ్యాన్ని ఉపదేశించుతూవుంటాడేగాని ఆయనకర్తవ్యాన్ని ఆలోచించడంమాత్రం శూన్యం. నీవు పిరికిపందవై రణరంగంనుండిపారిపోయి నా యెదుటకు రాకుండా, యుద్ధంలో ప్రాణాలేఅర్పించియుంటే నీధర్మపత్ని ఎంతఆనందంతో చితిని అధిరోహించేదో చూచేవాడవు."

"ప్రేయసీ!సమయానికి వేచియుండటమేయుక్తి."

"పిరికివాడే అట్టియుక్తులుబోధిస్తాడు. నిజమైనశూరుడు జయమో, మృత్యువో, రెంటిలో ఏదైనా ఒకదాన్నిమాత్రమే స్వీకరిస్తాడు. కాని నాకుపుత్రిక జన్మించింది. భగవానుడు పుత్రున్నిప్రసాదించలేదే అని చింతవేస్తుంది."

"ఆపుత్రుడుకూడా యుద్ధంలోపారిపోతే"

"సింహం ఎప్పుడూ నక్కనుకనదు"

* * * *

"అబ్బా, నేనుస్త్రీనైపుట్టితినసే ధిక్కారము. నేను పుత్రుడనై యేలజన్మించలేదు? కాని స్త్రీ అబలయగుటకు కారణమేమిటి? ఆమెకుకాళ్లుచేతులు లేవా, తలలేదా, హృదయంలేదా? శక్తి, తేజస్సు, బలము—ఇవన్నీ శిక్షణవలనా, అభ్యాసంవలనా సిద్ధించుతయి. చూస్తా! కోమలములైన బాహువులను కఠినమైన భుజదండములుగాచేస్తా, ఈముంజేతులలో అప్రతిహతమైన ఖడ్గాన్నిధరిస్తా, తల్లీ! నీవుచింత పొందబోకు; నేను తండ్రిగారిరాజ్యాన్ని శత్రువుల నుండి లాగుకొనివస్తేనే నాపేరు తార, నేను రాజపుత్రిబాలికను; పుత్రునిపనినే చేస్తానేను".

౨

"ప్రేయసీ! తారాకుమారి ఎక్కడకువెళ్లింది?"

"వేటకువెళ్లింది."

"మంచిపనిచేశావు. బాలుడాయేమిటి? అడ్డగించలాదాన్ని"

"నీవేఅడ్డగించి చూడపోయావు"

"ఆమె వివాహయోగ్యురాలుకూడాఅయిందే"

"ఆవిచారంకూడా తమరేచేయండి"

(తారాప్రవేశము)

"తండ్రిగారూ! మీకీ పులిపిల్లలను చూచారా!"

"అరే, అరే, దీన్ని ఇక్కడకు ఎవరు తెచ్చారు?"

"పొదలో దూరి నేనే తెచ్చా, పాపం దీనితల్లి నా బల్లెపుపోటు చేత చచ్చిపోయింది."

"బలే, నీవు పులినిచంపి పిల్లను తెచ్చా?"

"తండ్రిగారూ, ఎంతఅందమైనపిల్లో చూడండి!"

"తారాకుమారీ! నీయీపని ప్రశంసాపాత్ర అయిందికాదు. నీవు రాజపుత్రకన్యకవు. ఈవిధంగా పురుషవేషంవేసుకొని వేటాడటం నీకు ఉచితంకాదు. వెళ్లి లోపలకూర్చో"

"తండ్రిగారూ! పురుషులు పౌరుషవిహీనులై, విధ్యుక్తధర్మాన్ని వదలిపెట్టి, అబలులై, స్త్రీలకు ప్రధానగుణమైన లజ్జనువిడనాడి, శత్రువులపాదతాడనలు సహించుతూ కూర్చొనివప్పుడు నాబోటిస్త్రీలు తప్పకుండా వివశులై యీవేషంధరించవలసివస్తుంది."

"తారా! యీ తర్కం, యీ ప్రగల్భాలూ ఎక్కడ నేర్చా!"

"తండ్రిగారూ! పులిపిల్లను చూడరా మీరు! అమ్మగారూ మీరువచ్చిచూడండి."

"కుమారీ! పద, నీపులిని చూద్దాము."

3

(జయమల్లుడు)

"తారా! నిన్ను నేను ప్రేమించుతున్నా"

"ఇటువంటి కఠినవాక్యాలు నేనువినలేను, వాటిని నేను తిరస్కరించుతా"

"కాదు, తప్పకవినాలి"

"రాజకుమారా! నీవేమైనాఅనుకో, ఇందువిషయమైనన్ను బలవంతపెట్టబోకు"

"అబ్బా! ఎంతటి పాషాణహృదయం నీది, ఎవడిచ్చాడు నీకీరూపం?"

"నిన్ను పురుషునిగా, నన్ను స్త్రీగాను నిర్మించిన మూఢుడగు విధాత"

"తారా! నీవుసరిగా ప్రేమతత్వం గ్రహించలేదు"

"నిజమే, ఆతత్వం నేర్పనేలేదు, అది ధార్మికుల భోగవిద్య. ఇల్లు, వాకిళ్లు, సమస్తరాజ్యమును పోగొట్టుకొనిన దరిద్రునికన్యకకు అది ఉచితంకాదు"

"అయితే నీకోరికయేమిటి?"

"తండ్రిరాజ్యాన్ని తిరిగి సంపాదించేవరకు ఏవిషయానికీ నాహృదయంలో స్థానంఇవ్వను"

"ఎట్లా నెరవేరుతుందిఇది?"

"నేనుఎరుగను. నేనాలోచించేవిషయం ఇదే. ఏకాకినగు స్త్రీని. శస్త్రవిద్య నేర్చాను. కాని పురుషులంతా నిశ్చింతగాకూర్చుంటే నేను ఒంటరిగా చేసేదేమిటి?"

"ఇదేనా వివాహానికి ఆటంకం?"

"ఇదే; ప్రేమ విలాసప్రియులస్వప్నం, సాధకులకు అట్లాకాదు."

"నేను నీమాతృభూమిని ఉద్ధరించితే"

"అప్పుడు నిన్ను పెండ్లాడుతా—నీవు కోరినాసరే కోరకపోయినాసరే"

"నిజమేనా?"

"నిజం. ఈరూపం, యౌవనం, శరీరం, సమస్తం నీచరణాలకు అర్పించుతా"

"వివాహానంతరం ప్రేమిస్తావా!"

"అదినేను చెప్పజాలను, కాని నారూపం, శరీరం సమస్తమూ నిశ్శంకగా అమ్మివేస్తా! అది నీసంపత్తి అవుతుంది."

"అయితే సరే"

"రాజకుమారా! ప్రతిజ్ఞ నెరవేరనంతవరకు నా యెదుటకు రావద్దు."

४

"అర్ధరాత్రి, దొంగమాదిరిగావచ్చాను. నిజంగా ప్రేమగ్రుడ్డిదే, ఆహా! ఏమి ఆయౌవనం, చిందులాడుతున్నదే మలయమారుతంలో; ఆమెసౌందర్యంచూడు. ఆకాశంలో నక్షత్రాలెన్నో వున్నయి, కాని పృథ్విలో ఈమెఒక్కతేమాత్రమే. ఎటువంటిఅందము! అబ్బా, ఏమిలావణ్యము! నిద్రించుతూవుంది. ఎంత విశాలమైననేత్రాలు. ఆకనుబొమలతీరు, కెంపెమ్మొద

రెక్కలబోలు వెంట్రుకలు, స్వచ్ఛమైనవర్ణమూ, బలిష్టమైన కోమలమైనశరీరం; అదురుచున్న పెదవులు. ఏమిది! కాళ్లుఅడ్డగింపబడ్డవి"

"ఎవరు?"

"ప్రేయసీ! చరణదాసుడు"

"రాజకుమారా! ఎక్కడికిప్పుడు?"

"ప్రేయసీ! క్షమించు"

"ఒకక్షణంకూడా నిల్వకుండా వెళ్లిపో"

"తారా! కాదు, నేనుకోరిక నెరవేర్చుకోకుండా వెళ్లను."

"ఛీ, నీచుడా! కుమార్గీ! మేవాడకులకళంకీ! దొంగమాదిరిగా నీవుదాగిదాగి నాశయనగృహములోపలికివచ్చావు. ధిక్కారం, ధిక్కారం."

"తారా! ప్రేమగ్రుడ్డిది"

"తిరిగిచెపుతున్నా, వెళ్లిపో"

"లేవిచో"

"ప్రాణంపోతుంది"

"నేను ద్వారంబంధించివుంచా, నిన్నెవరు రక్షిస్తారు?"

"ఓరీ, మూర్ఖుడా! క్షత్రియబాలిక తననుతానే రక్షించుకొంటుంది, ఏమి! వెళ్లుతావా, లేదా?"

"ప్రేయసీ! ఒక్కసారి నాకోరిక నెరవేరనీయి"

"అయితే ఇదిగో" (కత్తితోపొడుచును)

"తారా! ఆగు, మరలకొట్టబోకు, వెళ్లుతున్నా.

"ఓరీ, పాపీ! ఇంకాలేదే" (రెండవదెబ్బ)

"క్షమించు, రిక్తహస్తున్ని, కొట్టబోకు"

"ఓరీ దొంగా! నిలువు అక్కడ—ఇదిగో"

(శిరస్సునరుకును)

౫.

"నాదే యీవేటమృగం"

"ఏమిటే, ఇంతసాహసమానీకు!"

"మహాగర్వించివున్నావే, ఎవరువునీవు!"

"నిర్భయంగా, కోమలంగా, సుందరంగా, ఉన్నావు నీవెవరవు?"

"మొదటిప్రశ్న నాది"

"అయితేవిను, నేను పృథ్వీరాజును"

"మేవాడ రాజపుత్రుడవా!"

"అవును, నీవెవరవు?"

"ఆవిషయందేనికిలే; వేటకువెళ్లుదాంపద"

"అట్లాకాదు, చెప్పాలి"

"నన్నుక్షమించు, రాజపుత్రా!"

"అదేమిమాట, నన్నేక్షమించు, దారితీయి"

"అపనినీదే"

"మనస్సులో అనుమానంగావుంది, నీవెవరవో ఎరుకపరచాలి."

"సరే, నేనుతారను."

"ఓహో, రాజకుమారీ! మంచికలయికే, యీవేట నాదే, నేనేస్వయంగానిన్ను వేటాడుతున్నా."

"రాజకుమారా! నాప్రతిజ్ఞ రాజపుటానాయందు అంతటా ప్రఖ్యాతమైవుంది. తమరు ఇటువంటి సంభాషణచేయవద్దు"

"కుమారీ! నేడేఆప్రతిజ్ఞ నెరవేరుతుంది"

"నిజమేనా!"

"నేడుమొహరం, ఇంకాపగలు రెండుఝాములు కూడా గడవలేదు, ముసల్మానులందరూ పండుగలో పాల్గొనివుంటారు. నాసైన్యం అయిదు వేల మంది రహస్యంగా దాగొనివున్నారు. కేవలం ఒక్కగంట ప్రయాణం, తమాషాచూస్తావాయేమి?"

"పరమానందంతో"

"తండ్రిగారిఆజ్ఞతీసుకోవాలా!"

"అవసరంలేదు"

"అయితే పద"

౬

"రాకుమారీ! సమస్తసైన్యం కోట వెలుపల పల్లంలో దాగొనియుండనియ్యి, మనందుర్గంలోకి వెళ్లుదాము".

"ఒంటరిగానా!"

"భయంవేస్తుందాయేమి?"

"మీరుండగా భయమా!"

"రాజపుత్రీ! నీఅసలివేటజంతు విక్కడేవుంది."

"ఆయితేపద"

"విజయసింహా!"

"ఏమి, మహారాజా!"

"సంకేతశబ్దం వినగానే దుర్గంలోకి బలాత్కారంగా జొరబడాలి."

"చిత్తం ప్రభూ!"

"రాకుమారి ద్వారందగ్గరవుంటుంది, ఆమెఆజ్ఞను పాలించుతూవుండు"

"చిత్తము"

"రాజపుత్రీ! పద"

౭

"తారాకుమారీ! నీఅశ్వం పొగరుపోతు, దాన్ని కొంచెం జాగ్రత్తగాపట్టుకో, లేకపోతే పురజనులు ఇటేచూడడం మొదలుపెడుతారు, ఇదిశత్రుపురం"

"రాకుమారా! నేడుదీన్ని స్వేచ్ఛగా నడప నీయండి"

"(క్షణకాలమాగి) చూడు ఎంతగుంపో, నేడు అందరూ మత్తెక్కివున్నారు"

"ఆగు, ఆయిద్దరు రౌతులు మననుదూరంనుండి చూస్తూన్నారు, సందేహించకుండావుండేటట్టు వారి దగ్గరిగాపద."

"సోదరా! నేడేమిపండుగ!"

"మీరు పరదేశీయులులాగా కనబడుతున్నారే, నేడు మొహరం."

"ఓహో, అట్లాగా, మేమిప్పుడేవస్తున్నాము, ఇదంతా మేముచూడవచ్చునా!"

"ఇప్పుడే సుల్తానువస్తున్నాడు, అడ్డగించేదెవరు? సంతోషంగాచూడండి."

"నిజమే, సుల్తానుదర్శనం మాకు అనాయాసంగానే లభిస్తుంది, అదుగో సుల్తానువస్తున్నాడు."

"(చెవిలో) రాజపుత్రా! ఇదేయదను."

"తారా, క్షణకాలంఆగు, దగ్గరిగా ఆయింటి మరుగుననుంచో."

"(ఒకబాణంతీసి) ఇదేయిష్టవచ్చినట్లు చేస్తుంది, రాకుమారా! నావేటజంతువును నేనేసంహరిస్తా."

"నీకంటే సాహసించేదెవరు! ముందుగా సుల్తానును బాగుగాగుర్తించాలి."

"వాడేగా, ఆతెల్లగుఱ్ఱంమీద."

"వాడే, పచ్చతలగుడ్డలో వజ్రం మెరుస్తుందే!"

"(బాణమెక్కుపెట్టి) రాజపుత్రా! వేటమృగం చస్తుందోలేదోచూడు."

"నిర్భయంగా నీవుబాణంవదులు."

(తార బాణంవదులును)

"వాడుచచ్చిపోయాడు, సుల్తాను వక్షస్థలంలో గుండాబాణం చీల్చుకుపోయింది, గుర్రమునుండి క్రిందపడ్డాడు, కోలాహలం జరుగుతూవుంది, చూడు! వారు ఈవైపువస్తున్నారు, రాజపుత్రీ! నీబల్లెము సరిగాపట్టుకో, నాకుదూరంగావుండబోకు, సరిగా ముందుకేనడువు, ద్వారం ఇప్పుడేతెరుచుకొంటుంది"

"రాకుమారా! జాగ్రత్త" (ఒకమ్లేచ్ఛునిబల్లెముతో పొడుచును)

"రాజపుత్రీ! జాగ్రత్త" (ఒకసిపాయినినరుకును)

"రాజపుత్రా! ముందుకుసాగు"

"ఓహో, ద్వారంలోమదించిన యేనుగొకటి నిల్వబడివుంది, సేనఅంతా పరుగెత్తుకొనివస్తూంది"

"మరేమీచింతలేదు" (ముందుకుసాగి ఖడ్గముతో ఏనుగు 'తొండమునునరుకగా ఘీంకారముసల్పుచు ఏనుగుపరుగెత్తెను. వెంటనే ద్వారంతెరచి—)

"విజయసింహా!"

"రాజకుమారీకి జయ్"

(సేన దుర్గంలోప్రవేశించుట, భయంకరమైనయుద్ధం, దుర్గవిజయం.)

౮

"తారాకుమారీ! వీరు మేవాడ రాజపుత్రులగు పృథ్వీరాజు. వీరికినమస్కరించు, నీతండ్రిరాజ్యాన్ని వుద్ధరించారు."

"తండ్రిగారూ! వీరియశస్సు నాకు పనిపింప నక్కరలేదు."

"రాజపుత్రా! ఈమెయే నాపుత్రిక. ఈదరిద్రుని మస్తకమునకు కిరీటము, నాజీవనధార, తార"

"తండ్రిగారూ!"

"పుత్రీ! నీప్రతిజ్ఞ జ్ఞాపకమున్నదా!"

"ఆ"

"రాజపుత్రా! నిన్ను నాఅల్లునిగా జేసుకొన్నాను, ఈదరిద్రునిదానం స్వీకరించండి, నేనుకాదు తారనీకు యోగ్యురాలు"

"మహారాజా! నీపుత్రిక స్వీకరించిందా!"

"ఆ, ఆమెఅంగీకరించింది, పుత్రీ! చెయ్యి ముందునకుసాచు, మీరుకూడాముందుకురండి, పృథ్వీ! మేవాడశూరా! నేను నాపుత్రికను నీకు సమర్పించుకొన్నాను"

"తండ్రీ! మేము తమకు నమస్కరిస్తున్నాము"

"ఇరువురు చిరంజీవులుకండు, సుసంతానముతోను, సుయశస్సుతోను విరాజిల్లండి."

* * * *

"ప్రేయసీ! నీవు నన్నుకొన్నావు, నేను వేరుచోట ఉండజాలను."

"నాథా! పుట్టుకతో నేను ప్రేమపాఠం నేర్చుకోలేదు, తమరే నాకీకఠినపాఠం నేర్పారు."

"ప్రేయసీ! నేను నీకుగురువును, శిష్యున్ని కూడాను."

"స్వామీ! నేనీవిధంగా నిన్నుప్రేమింపగలనని ఎన్నడూ భావించలేదు. నీవీరగాథలువిన్నప్పుడు నాకు నీచరణదాసినికావలెనని కోరికఉండేది. అది సంభవిస్తుందని యెప్పుడూ అనుకోలేదు. తమప్రథమ సందర్శనంచేత హృదయం కొట్టుకులాడింది. కఠోర భావాలతోనిండినముఖం, ఎఱ్ఱనినేత్రాలూ, చూచి భయపడిపోయాను. "నేను ప్రతిజ్ఞచే బద్ధురాలనైన స్త్రీని, నాయీశరీరం ప్రతిజ్ఞపైనే విక్రయించాలి" అని నేను భావించాను. ముగ్ధురాలనై నేడు నీచరణములకు మనోవాక్కర్మల దాసినైనాను."

"ప్రాణేశ్వరీ! ఈపృథ్వియొక్క కఠినమైన ఒడిలో ఈనూత్నమైన, స్థిరమైనమెరుపు, ఈప్రియమైనవెన్నెల, ఈసజీవసౌరభము, ఈసదేహసంగీతము నాకుప్రాప్తించునని ఎప్పుడూ ఆలోచించనేలేదు."

"ప్రాణేశ్వరా! మీరు పంచప్రాణాలతో నన్ను ప్రేమించుతున్నారు. ఆమాధ్యముచేతనే నేను మెరుపును, సౌరభమును, సంగీతమును అని ఏమేమోఅంటున్నారు. నేను కేవలం నీదాసీని, తారను. నాయందు గుణమున్నది, దోషమున్నది, నేను అధమస్త్రీని. స్వామీ! నన్నెల్లప్పుడూ క్షమించండి"

"ప్రేయసీ, నాకుదోషమేమీ కనిపించడంలేదే"

"నాథా! ప్రియుడు దోషాన్ని చూడజాలడు."

"ప్రేయసీ, వెళ్లుదాముపద, మనం పరస్పరం విలీనులమై ప్రపంచాన్ని మరచిపోదాము."

—హిందీనుండి.

బాలకృష్ణుఁడు

మానేపల్లి లక్ష్మయ్యగారు

సతతము భక్తయోగిమునిసంఘములై హికముల్ద్యజించి ని
శ్చితమతితో మదంఘ్రులను జింతనచేయుచునుందు; రిందునే
యతిమధువుల్ చెలంగునోయటంచు ముఖమ్మునఁగాలిఁవ్రేలు గీ
లితమొనరించు బాలుని యలేఖ్యవిలాసుని యాశ్రయించెదన్.